సాక్షి సంగారెడ్డి

శుక్రవారం : 26 : మే : 2023



ఒకేచోట చితి పేర్చి..
ఔరంగాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అన్నదమ్ముల మృతదేహాలు గురువారం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. 8లో



జనాభా ఎక్కువ..
రోజురోజుకు గ్రామాలు పట్టణ ప్రాంతాలుగా మారి నూతన కాలనీలు ఏర్పడ్డాయి. జనాభాకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. 9లో

అందరికీ నెగెటివ్
పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 11 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేసినట్లు చెప్పారు.



రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు, పోడు భూముల పట్టాల పంపిణీ, తదితర అంశాలపై గురువారం సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ డాక్టర్ శరత్ కుమార్, ఎస్పీ రమణకుమార్ హాజరయ్యారు.

తరుగు దోపిడీ రూ.7.31 కోట్లు!

- కేంద్రాల నిర్వాహకులు, మిలర్లు దండుకున్న మొత్తం ఇది
- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు జరిగిన నష్టంపై అంచనా
- ధాన్యం దించుకునేటప్పుడు కోతలు అదనం



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో 40 కిలోల బస్తాకు రెండు కిలోల చొప్పున కోత విధిస్తున్నారు. అంటే క్వింటాల్‌కు తక్కువలో తక్కువ ఐదు కిలోలు రైతులు నష్టపోతున్నారు. ఈ లెక్కన ఒక టన్నుకు 50 కిలోలు (అర క్వింటాల్) ధాన్యం రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు 213 కొనుగోలు కేంద్రాల పరిధిలో 71 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ లెక్కన తరుగు పేరుతో జరిగిన దోపిడీ ఏకంగా 35,500 క్వింటాళ్లు. ప్రస్తుతం వరి ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.2,060 ఉంది. ఈ లెక్కన ఇప్పటి వరకు 35,500 క్వింటాళ్లకు ఏకంగా రూ.7.31 కోట్లు రైతులను నిలువు దోపిడీ చేసినట్లు అంచనా.

వాటా పంచుకుంటున్న మిల్లర్లు, నిర్వాహకులు

- ఇలా రైతుల వద్ద తరుగు పేరుతో కోత విధించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైసుమిల్లర్లు కలిపి వాటాలు పంచుకుంటున్నారు.
- రైతుల వద్ద కోత విధించగా మిగిలిన ధాన్యాన్ని బినామీ రైతుల పేర్లతో రికార్డులు రాసి తరుగు ధాన్యం డబ్బులను డ్రా చేస్తున్నారు.
- నిబంధనల ప్రకారం ఒక్కో బస్తాకు 40 కేజీల ధాన్యం తూకం వేయాలి. కానీ, గోనె సంచి బదులుగా కాంటాలో మరోవైపు గోనె సంచిని వేసి 40 కేజీల ధాన్యాన్ని మాత్రమే తూకం వేయాలి.
- కానీ, ఒక్కో బస్తాకు 43 కిలోల నుంచి 44 కిలోల వరకు ధాన్యాన్ని జోకి రైతులను అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇది ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనే కాకుండా, దాదాపు అన్ని కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే దోపిడి జరుగుతోంది.
- ఇలా ఒక్కో సీజనుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు రూ.కోట్లలో దండుకుంటున్నారు.

తరుగు ఇవ్వకపోతే కాంటాలే పెట్టడం లేదు.

- ఎవరైన రైతులు తరుగు విషయంపై ప్రశ్నిస్తే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆ రైతు ధాన్యాన్ని తూకమే వేయడం లేదు.
- దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంత కోత విధించినప్పటికీ కిమ్మనకుండా ఊరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ధాన్యం దించుకునేటప్పుడు కోత అధనం..

- కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ ఈ స్థాయిలో జరిగితే ధాన్యం లారీ రైసుమిల్లుకు చేరాక, అక్కడ మిల్లర్ల దోపిడీ అదనంగా జరుగుతోంది.
- తాలు ఎక్కువగా ఉందనే, రంగు మారాయని సాకు చూపి క్వింటాల్‌కు మరో రెండు, మూడు కిలోలు కోత విధిస్తున్నారు. ఇలా ఒక్కో రైతుకు క్వింటాల్‌కు ఆరు నుంచి ఏడు కిలోలు నష్టపోవాల్సివస్తోంది.

ఉత్తుత్తి ఆదేశాలే..

- తూకంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు ఎక్కడా అమలు కావడంలేదు.
- ఈ ఆదేశాలు ఏ ఒక్క సెంటర్‌లోనూ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. ఇదేమిటని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షాలకు వడ్లు తడుస్తాయనే భయంతో ఉన్నాం. కనీసం ఆరబెట్టుకునేందుకు కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం.
– అనంతగిరి, రైతు, జిన్నారం

తరుగు పేరుతో మోసం



జోగిపేట(అందోల్): నాకు 11 ఎకరాల వ్యవసాయ భూమి. ఈసారి 480 బస్తాల దిగుబడి వచ్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో విక్రయించా. కేంద్రంలో ఒక సంచికి 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా, తరుగు పేరుతో 42 కిలోలు వేస్తున్నారు. కనీసం 41 కిలోలు పెట్టాలన్నా నిర్వాహకులు ఒప్పుకోవడంలేదు. రైస్ మిల్లులో లారీకి 20, 15 సంచుల వరకు తరుగు తీస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో, రైస్‌మిల్‌లలో దోపిడి చేస్తున్నారు.
– ముస్లాపురం బాగయ్య, పోసానిపేట, అందోలు మండలం



ఇస్నాపూర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న తెలంగాణ విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ విజయలక్ష్మి

'మన ఊరు–మన బడి'తో మెరుగైన సౌకర్యాలు

తెలంగాణ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: 'మన ఊరు – మనబడి'తో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలంగాణ విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ పీపీ రాథోడ్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా «మన ఊరు–మన బడి» కార్యక్రమంలో భాగంగా జరిగిన పనుల్లో ఇస్నాపూర్ ప్రాథమిక పాఠశాల, కంది మండలం జుల్కల్ పాఠశాల చాలా బాగున్నాయన్నారు. మన ఊరు–మన బడితో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సీఎంఓ వెంకటేశం, హెచ్ఎం హేమ, సీఆర్‌పీ శేషాద్రి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కోసమే ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు తీరును పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వనజాత

డీఎస్‌ఓ వనజాత

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని డీఎస్‌ఓ వనజాత తెలిపారు. గురువారం నిజాంపేట మండలం మునిగేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యంలో తేమ శాతం పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా త్వరగా ధాన్యం తూకం వేయాలన్నారు. సూచించారు. లారీలు తెప్పించి వెంటనే తరలించాలన్నారు. త్వరగా కొనుగోళ్లు పూర్తిచేయాలన్నారు.

న్యూస్‌రీల్

సమ్మెను పట్టించుకోకపోవడం దారుణం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



వినతిపత్రం అందజేస్తున్న ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): తమ సమస్యల పరిష్కారానికి ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)లు చేస్తున్న నిరవధిక సమ్మె 39వ రోజుకు చేరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వీఓఏ పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. 39 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరుటౌన్: కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంగా పనిచేస్తూ బీజేపీని బలోపేతం పనిచేస్తూ ముందుకెళ్లాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడ నుంచి వచ్చే వ్యర్థాలు, టిప్పర్ల రాకపోకలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి, మాజీ వార్డు సభ్యుడు జనార్దన్ రెడ్డి, వార్డు సభ్యులు నారాయణ దాసు, గోపాల్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో ఇరిగేషన్ అధికారుల పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయాన్ని రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ అధికారులు సందర్శించారు. గురువారం ఆలయానికి వచ్చిన అధికారులు నాగేందర్, అజయ్‌కుమార్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారు గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మురళీధర్, డిప్యూటీ ఈఈ జానకి రామ్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేతకిలో ఇరిగేషన్ అధికారులు

అనుమతిలేని రెండు ప్రైవేటు ఆస్పత్రుల సీజ్



పాలీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి

జహీరాబాద్: జహీరాబాద్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న రెండు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గాయత్రిదేవి సీజ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను గాయత్రిదేవి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. అనుమతి లేకుండా బ్లాక్ రోడ్డులో చందు పాలీ క్లినిక్‌ను డాక్టర్ బి.సుధీర్ పేరుతో దరఖాస్తు చేసి అందులో డాక్టర్ రమేశ్‌తో వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఇతరులు విదేశాల్లో డాక్టర్ కోర్సు చదివి ఇండియాకు వచ్చిన తర్వాత ఇక్కడి ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత కావాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా ఇతడు వైద్యం నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. తనిఖీ సమయంలో డాక్టర్ లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే అనురాగ్ థియేటర్ రోడ్డులోని గ్రేస్ హాస్పిటల్ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కారణంగా రూ.10 వేలు ఫైన్ విధించి, సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, జిమ్నాస్టిక్స్, ఫిజియోథెరపీ కేంద్రాలు, ఆయూష్ క్లినిక్‌లు ఉన్నట్లయితే వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు.

లిఫ్ట్ చూసి.. రికార్డులు పరిశీలించి



మునిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

మునిపల్లి(అందోల్): సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు. గురువారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించారు. భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు మునిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీపై తహసీల్దార్ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. తనిఖీ సమయంలో తహసీల్దార్ శివకుమార్, ఉప తహసీల్దార్ కృపాదానం, లింగాగౌడ్ తదితరులు ఉన్నారు.


శ్రీరాచన్న స్వామి హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం బిడంపేట రాచన్నస్వామి ఆలయంలో రెండు నెలల హుండీ లెక్కించారు. గురువారం చేపట్టిన లెక్కింపులో రూ.2,18,684 ఆదాయం వచ్చింది. భక్తులు సమర్పించిన బంగారు, వెండి ఆభరణాలు హుండీలో వేసి సీల్ చేశారు. హుండీ లెక్కింపు దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప, పాలక మండలి మాజీ చైర్మన్ సోమలింగం, పాలక మండలి సభ్యులు పాండురంగారెడ్డి, జగదీశ్వర్ స్వామి, భక్తులు రాజన్న, శివమూర్తి స్వామి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



హన్సిక

పటాన్‌చెరు టౌన్: జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 9 వతరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గురువారం నిర్వాహకులు ఈ విషయం తెలిపారు. హన్సిక బ్యాడ్మింటన్ మహిళల కేటగిరి డబుల్స్, మిక్సిడ్ డబుల్స్, సింగిల్ రన్నర్ విభాగాల్లో సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈనెల 29, 30 తేదీల్లో గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనుంది.

చెరకు బకాయి చెల్లించాలి

- కేన్ కమిషనర్ ఆధ్వర్యంలో సమావేశం
- మూడు విడతల్లో చెల్లిస్తామన్న ట్రైడెంట్ యాజమాన్యం



బకాయిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, కేన్ కమిషనర్ బద్రు మల్హోత్రా, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కర్మాగారం అధికారులు

జహీరాబాద్: చెరకు రైతులకు బకాయి ఇప్పించేలా ట్రైడెంట్ చక్కెర కర్మాగార యాజమాన్యం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ కేన్ కమిషనర్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని షుగర్ కేన్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ భద్రు మల్హోత్ర ఆధ్వర్యంలో జరిగిన సామవేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఈ క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రూ.12.71 కోట్లు బకాయి పడిందని, వాటిని ఇప్పించేలా చూడాలన్నారు. యాజమాన్యం తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి ఇప్పించేందుకు తమ ముందు ఉన్న అవకాశాల ద్వారా రైతులకు సహాయపడతామన్నారు. ఈ సందర్భంగా ట్రైటెండ్ చక్కెర కర్మాగారం హక్కుదారు శ్రీరాం నాథ్, అధికారులు ప్రదీప్ బేడ్, సత్యనారాయణ రెడ్డిని పిలిపించి చర్చించారు. ఈనెల 29వ తేదీన రూ.కోటి, జూన్ 2వ తేదీన రూ.2 కోట్లు, మిగతా రూ.9.71 కోట్లు జూన్ 25వ తేదీ నాటికి చెల్లించడం జరుగుతుందని, ఇందుకు తగిన సహకారం అందించాలని కోరారు. వచ్చే సీజన్‌కుగాను కర్మాగారంలో క్రషింగ్ కోసం సిద్ధం చేయనున్నట్లు యాజమాన్యం పేర్కొంది. సమావేశంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సారెడ్డి, హైదరాబాద్ సహాయ కేన్ కమిషనర్ శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా కేన్ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, చెరకు నియంత్రణ అధికారి రాధిక పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

సదాశివపేట (సంగారెడ్డి): ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సదాశివపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించి రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

సంగారెడ్డిటౌన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల ఉపాధ్యాయ ఉచిత శిక్షణకు గడువు పొడిగించినట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు గురువారం తెలిపారు. ఈనెల 28 వరకు గడువు పొడిగించామని, డిగ్రీ తోపాటు బీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఇతరులకు 25 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. tsbcstudycircle @gmail.comలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాటక ప్రదర్శన



నారాయణఖేడ్: పట్టణంలో 'బుద్ధం.. శరణం.. గచ్ఛామి' పేరిట కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఆవరణలో ఏర్పాటు చేయాలని మొదట నిర్ణయించగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉండటంతో పాటు సరైన సదుపాయాలు లేకపోవడంతో పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జూన్ 3న గీతం 14వ స్నాతకోత్సవం

గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ 14వ పట్టాల ప్రదానోత్సవం (స్నాతకోత్సవం) జూన్ 3న నిర్వహించనున్నట్లు గీతం హైదరాబాద్ ప్రొ.వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీఎస్.రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గీతం హైదరాబాద్ ప్రాంగణంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్ ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులను 2022–23 విద్యా సంవత్సరం నాటికి పూర్తిచేసిన విద్యార్థులు, డిగ్రీలు, డిప్లొమోలు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. గీతం వీసీ డాక్టర్ సరేందర్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి గీతం అధ్యక్షుడు ఎం.భరత్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.5 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.1,05,83,558ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. 59రోజుల అనంతరం గురువారం స్వామివారి ఆలయ ముఖ మండపంలో సిద్దిపేట దేవాదాయ శాఖ పరిశీలకులు రంగరావు ఆధ్వర్యంలో హుండీలను ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సభ్యులు లెక్కించారు. నగదు రూ.1,05,83,558, విదేశీ కరెన్సీ 27, మిశ్రమ బంగారం 68 గ్రాములు, మిశ్రమ వెండి 11కిలోల 100 గ్రాములు, పసుపు బియ్యం 18 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదును బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ధర్మకర్తలు రఘువీరరెడ్డి, సౌజన్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, పోలీసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత కవర్లు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆలయంలో లడ్డూ, పులిహోర, సిరా ప్రసాదం ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గురువారం నుంచి ప్లాస్టిక్ రహిత కవర్లను వినియోగిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గీస భిక్షపతి తెలిపారు.

క్లుప్తంగా

బంగారం, వెండి అపహరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): తాళం వగులగొట్టి ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన వంతం సాయికిషోర్ కుటుంబీకులు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి విందుకు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి బీరువాలోని 25 గ్రాముల బంగారం, 10 గ్రాముల రింగు, 5 గ్రాముల కమ్మలు, 15 తులాల వెండి పట్టాగొలుసులు, 6 తులాల వెండి బ్రాస్‌లెట్, 2 తులాల వెండి మెట్టెలు, ల్యాప్‌టాప్ దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివానందం కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు చోరీ

నర్సాపూర్: వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లారీ చోరీ విషయం మరువక ముందే రెండు బైకులు చోరీకి గురయ్యాయి. నర్సాపూర్‌కు చెందిన జునద్ అలీ మాట్లాడుతూ తన బైక్‌ను బుధవారం రాత్రి సంగారెడ్డి మార్గంలోని వాటర్ వాష్ సెంటరు వద్ద పార్కు చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని చెప్పా రు. నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మల్లేష్ ఆస్పత్రి వద్ద పార్కు చేసిన బైక్‌ను కూడా అపహరించుకువెళ్లారు. ఆస్పత్రి సీసీ కెమెరాలలో చోరీ దృశ్యం రికార్డు అయినట్టు తెలిసింది. తమ బైకులు చోరీ అయ్యామ ంటూ ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ పొలం వద్ద..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పార్క్‌చేసిన బైక్ చోరీకి గురైంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన రైతు ముష్కం గణేశ్ తన బైక్‌పై మంగళవారం సాయంత్రం మల్యాల శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన బైక్ నిలిపి పొలానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించలేదు. దీంతో గురువారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

నంగునూరు(సిద్దిపేట): తాటి చెట్టుపైనుంచి కింద పడడంతో గీత కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన బందారం శేఖర్‌గౌడ్ గురువారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడగా కాళ్లు, చేతులు, పక్కటెముకలు విరిగాయి. ఇది చూసిన గ్రామస్తులు అతడిని 108లో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకేచోట చితి పేర్చి..

నలుగురు అన్నదమ్ముల అంత్యక్రియలు

హుస్నాబాద్: బంధువుల అంత్యక్రియలకు వచ్చిన నలుగురు అన్నదమ్ములు కానరాని లోకాలకు వెళ్లారు. ఇంటి నుంచి బయలుదేరి 24 గంటలు గడవకముందే మృత్యువు కబలించడంతో విగత జీవులయ్యారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన నలుగురు అన్నదమ్ముల మృతదేహాలు గురువారం స్వగ్రామానికి చేరుకున్నాయి. గ్రామానికి చెందిన ఎరుకుల కృష్ణ, శ్రీనివాస్, సంజీవ్, సురేష్ గుజరాత్‌లోని సూరత్‌లో స్థిరపడ్డారు. బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి సూరత్‌కు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్వగ్రామానికి చేరిన మృతదేహాలను చూసిన కుటుంబసభ్యులు బోరున విలపించారు. కడసారి చూసేందుకు గ్రామస్తులు, స్నేహితులు భారీగా తరలివచ్చారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన నలుగురికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలో నలుగురికి ఒకే చోట చితి పేర్చి నిప్పుపెట్టారు. మృతులు కృష్ణ చితికి తండ్రి రాజయ్య, శ్రీనివాస్‌కు తండ్రి రాములు, సంజీవ్‌కు కుమారుడు ప్రభాస్, సురేష్‌కు అతడి కుమారుడు భార్గవ్ నిప్పుపెట్టారు. అంతకుముందు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.



వ్యవసాయక్షేత్రంలో ఒకే చోట చితికి నిప్పుపెట్టిన కుటుంబసభ్యులు



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కార్మికుల ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పారిశ్రామికవాడలోని హార్లెక్స్ రబ్బర్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని కార్మిక భవనం ఎదుట కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హార్లెక్స్ రబ్బర్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను తక్షణమే ఎత్తేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ లాకౌట్‌తో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పరిశ్రమను మూసివేయడం సరైంది కాదన్నారు. కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందని వరప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పేకాట ఆడుతుండగా...

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు శివారులో కొంతమంది పేక ఆడుతున్నట్టు సమాచారంతో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి రూ.20,200లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

కార్మికుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కార్మికుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం ఎస్‌ఐ రామునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సహదేవ్(30) పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో ఉన్న తోషిబా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నారు. స్థానికంగా ఇద్దరు స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. ఈనెల 8వ తేదీన డబ్బులు తీసుకుని స్వగ్రామానికి వెళ్తానని బయలుదేరాడు. అయితే స్వగ్రామం చేరుకోలేదు. అద్దెకు ఉంటున్న గదికి కూడా రాలేదు. దీంతో గదిలో ఉంటున్న స్నేహితుడు తస్లీం అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): దేవాలయంలో గంటలను దొంగిలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..కొండపాకలోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి గ్రామస్తులు దర్శనం కోసం వెళ్లారు. గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన చిన్నోళ్ల ఆంజనేయులు దేవాలయంలోని గంటలను దొంగిలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారన్నారు. అనంతరం నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిలో గుర్తు తెలియనివ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం ఉదయం హనుమాన్‌బండల్ శివారు మంజీరాపాయ పక్కన బండ రాళ్ల పక్కన ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పశువుల కాపరుల ద్వారా సమాచారం తెలిసిందన్నారు. ఘటన స్థలానికి వెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయే స్థాయిలో ఉందన్నారు. ఆ వ్యక్తి సుమారు 35 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, ఛాతీపై జంగయ్య అనే పేరుతో పాటు లవ్ సింబల్, దాని పక్కన వీరమణి అనే పేరున్న పచ్చబొట్టు ఉందన్నారు. మరోవైపు మృతుని కుడి భుజంపై ఓం ఆకారంలో మరో పచ్చబొట్టు పొడిచి ఉందన్నారు. శరీర పైభాగంలో ఎలాంటి వస్త్రం లేకపోగా, కింది భాగంలో బూడిద రంగు జీన్ ధరించి ఉన్నాడన్నారు. తలపై బలమైన ఆయుధాలతో గాయపరిచిన ఆనవాళ్లు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే.. మెదక్ రూరల్ సీఐ-8712657916, ఎస్‌ఐ కొల్చారం- 8712657919 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.



మృతదేహంపై ఉన్న పచ్చబొట్టు

దోపిడీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

నారాయణఖేడ్: ఓ మహిళ మెడలోంచి ఆభరణాలను దోపిడీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నారాయణఖేడ్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఖేడ్ మండలం చాప్టా(కె)కు చెందిన బీమ్రా నాగమ్మ (52) బుధవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రం నుంచి ఒంటరిగా ఇంటికి వెళుతోంది. మార్గమధ్యలో మనూరు మండలం డోవూరుకు చెందిన బూతపల్లి నాందేవ్ ఆమెను అడ్డగించి ఒంటిపై ఉన్న నగలు ఇవ్వాలని లేని పక్షంలో చంపేస్తానని బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో చెవికమ్మలు లాగగా చెవి తెగింది. కమ్మలతోపాటు పట్టగొలుసులు, పుస్తెకు సంబంధించిన దండలు లాక్కుని రాయితో తలపై మోది పారిపోతున్న క్రమంలో బాధితురాలు అరవడంతో సమీపంలో ఉన్న ఆమె భర్తతోపాటు పలువురు గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. ఖేడ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆభరణాలను సీజ్ చేశారు. నిందితుడిపై దోపిడీ కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించారు.



నిందితుడి అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

తప్పిపోయిన వ్యక్తి గుర్తింపు

కుటుంబ సభ్యులకు అప్పగింత

సంగారెడ్డిటౌన్: తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. సంగారెడ్డి మండలపరిధిలోని కులబ్‌గూర్ గ్రామ పంచాయతీ పరిధి టీజీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణ మంగళవారం నుంచి కనిపించడం లేదు. దీంతో అతడి భార్య సంగీత బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కనిపించకుండా పోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



కృష్ణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఈదురుగాలులకు గోదాం పైకప్పు ధ్వంసం



లేచిన గోదాం పైకప్పు రేకులు

దుబ్బాకరూరల్: మండలంలో రెండు రోజుల క్రితం వీచిన ఈదురుగాలుల ధాటికి దుబ్బాక వ్యవసాయ మార్కెట్ గోదాం పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. నాలుగు నెలల క్రితమే ఏర్పాటు చేసిన పైకప్పు నాణ్యతతో లేకపోవడంతోనే ఇలా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టడంతోనే గాలిదుమారానికి రేకులు విరిగిపోయాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే కాంట్రాక్టర్లు ఇష్టారీతిన పనులు చేస్తున్నారని, నాణ్యతను పరిశీలించకుండా అధికారులు బిల్లులు మంజూరు చేస్తున్నారని విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నాసిరకం రేకులు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సారాయి విక్రేత అరెస్ట్

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలి తండాలో అక్రమంగా సారాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు తండాకు వెళ్లి రాథోడ్ అనిల్ పట్టుకుని ఐదు లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కర్ణాటకలో తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని వచ్చి ఇంటి దగ్గర ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.



నాటు సారాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: భార్యతో గొడవపడి ఓ భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన సర్వర్ (36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బంధువుల పెళ్లిలో భార్య ముబీనాబేగంతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇంటికి చేరుకొని ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు రైతుల ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళా రైతు, యువ రైతు, కూతురి పెళ్లి చేసిన అప్పు తీర్చేందుకు భూమి అమ్మగా, ఆ విషయమై గొడవ జరగడంతో ఇంకో రైతు ఆత్మహత్య చేసుకున్నారు.

భూమి విషయంలో గొడవతో...

జోగిపేట(అందోల్): కూతురు పెళ్లికి చేసిన అప్పుతీర్చేందుకు తన కున్న భూమిని విక్రయించగా, ఆ భూమి వివాదంలో చిక్కుకోవడంతో మనస్తాపంతో విక్రయించిన భూమిలోనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఎస్‌ఐ 2 జయశంకర్ కథనం ప్రకారం... జోగిపేటకు చెందిన రమేశ్(50) తన కూతురు పెళ్లి కోసం అప్పు చేశాడు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వారికి 20 గుంటల భూమిని విక్రయించాడు. అయితే కొనుగోలు చేసిన వ్యక్తి 20 గుంటల భూమి చుట్టూ కడీలలు ఏర్పాటు చేశాడు. అయితే ఇందులో 2 గుంటల భూమి తన భూమిలో నుంచి పోయిందని రమేశ్‌ను సోదరుడు ప్రశ్నించాడు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కొనుగోలుదారుడు మీ భూమి మీరు తీసుకొని నా డబ్బు నాకు ఇవ్వాలని కొన్ని రోజులుగా డిమాండ్ చేశాడు. భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో పెళ్లి అప్పు చెల్లించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన రమేశ్ బుధవారం రాత్రి తాను దావత్ వెళుతున్నానని, ఆలస్యం అవుతుందని, ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. గురువారం సోదరుడు పొలం వద్దకు వెళ్లగా అక్కడ రమేశ్ అక్కడ విగత జీవిగాపడి ఉండటాన్ని గమనించాడు. అప్పటికే ప్రాణాలు కోల్పోయి ఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పక్కన ఎలుకల మందు, మద్యం బాటిల్ ఉండటంతో అది సేవించినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మల్లేశ్వరీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కదాల రమేశ్ (ఫైల్)

అప్పుల బాధతో మహిళా రైతు...

హుస్నాబాద్‌రూరల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళా రైతు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం ..హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామానికి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి మాధవి(35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం, ఇల్లు నిర్మాణం కోసం రూ.7లక్షలు, పాడిపశువుల కొనుగోలు కోసం మరో రూ.2 లక్షలు అప్పు చేశారు. పాడి పశువులు నెల రోజులకే మరణించాయి. దీంతో అప్పు తలకు మించిన భారమైంది. దీంతో మనస్తాపం చెందిన మాధవి ఈ నెల 2న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి అక్క పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు.



బద్దిపడగ మాధవి (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో యువరైతు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన మొగుళ్ల కేసోళ్ల రాజయ్య–కిష్టవ్వల కుమారుడు కుమార్(34) గొర్ల పెంపకంతో పాటు తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ భార్య కల్పనను పోషించుకుంటున్నాడు. కాగా కుమార్‌కు పెళ్లై ఏడు సంవత్సరాలు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. పిల్లల కోసం అందిన కాడికి అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాడు. దీంతో ఫలితం కానరాకపోవడంతో మదన పడేవాడు. మరోవైపు ఇటీవల వడ్ల అకాల వర్షాలకు 30గుంటల్లో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు రాలేదు. ఈ క్రమంలో ఆర్థికభారం మరింతగా పెరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన కుమార్ బుధవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. భార్య కల్పన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




మొగుళ్ల కుమార్ (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడిమెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు.

బైక్, ట్రాలీఆటో ఢీకొని..

నర్సాపూర్ రూరల్: బైక్, ట్రాలీఆటో ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. నర్సాపూర్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన బుసగల్ల శ్రీనివాస్ (42) వెలమకన్నె కృష్ణ కలిసి బైక్‌పై నర్సాపూర్ నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్నారు. రేణుకఎల్లమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బుసగల్ల శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణకు పలుచోట్ల గాయాలు కాగా, అతని పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య మల్లమ్మ, పిల్లలు సాయికిరణ్, నిహారిక, ధనుష్ ఉన్నారు. శ్రీనివాస్ తనకున్న కొద్దిపాటి భూమి సాగు చేస్తూ ఖాళీ సమయంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు.



బుసగల్ల శ్రీనివాస్ (ఫైల్)

రైస్‌మిల్లుకు వెళ్తుండగా...

బుసగల్ల శ్రీనివాస్, కృష్ణలు రైస్‌మిల్లుకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. నర్సాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయడంలో ఆలస్యమవుతుందని, మిల్లులో ధాన్యం అమ్ముకుందమని అడిగేందుకు ఇద్దరూ వెళుతుండగా, ఈ ఘటన చోటుచేసుకుంది.

బైక్‌పై నుంచి పడి మహిళ ..

వర్గల్(గజ్వేల్): చికిత్స కోసం అల్లుడితో బైక్‌పై వెళ్తున్న మహిళ కిందపడి మృతి చెందింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గాడి మలక్‌పేటకు చెందిన వీరన్నగారి లక్ష్మి(61) ఆరోగ్యం బాగాలేకపోవడంతో గజ్వేల్ ఆస్పత్రిలో చూపించుకునేందుకు తన అల్లుడు ఎర్రబాబు నాగరాజుతో బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో వర్గల్ మండలం గౌరారం వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనుకాల కూర్చున్న ఆమె ఎగిరి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మి మృతదేహం

బైక్‌పై నుంచి కింద పడి వివాహిత

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ములుగు మండలం గంగధార్‌పల్లికి చెందిన తాటికొండ శైలజ(19) భర్త సురేష్‌గౌడ్‌లు గురువారం ఉదయం తూప్రాన్ మండలం కాళ్లకల్ నుంచి గంగధార్‌పల్లికి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో తున్కిబొల్లారం గ్రామ శివారులోకి చేరుకోగానే శైలజ చున్నీ బైక్ చక్రానికి చుట్టుకుని ఆమె మెడకు బిగుసుకొని కిందపడింది. ఈ ఘటనలో ఆమె తలకు, ముఖానికి బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శైలజ (ఫైల్)

బస్సును ఢీకొన్న బైక్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ బైక్ బస్ ఢీకొంది. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద గురువారం జరిగిన ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిపల్లికి చెందిన రాకేష్, నవీన్ బైక్‌పై ధర్మసాగర్ వెళుతున్నారు. ముందు ఉన్న బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా మరో బస్సు వచ్చింది. దీంతో బైక్‌ను పక్కకు తప్పించే క్రమంలో ముందున్న బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న నవీన్‌కు కిందపడి గాయాలయ్యాయి. బాధితుడిని ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన నవీన్

ఇద్దరికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు మోపెడ్‌లు ఎదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, కురుమ పాపయ్యలు మోపెడ్‌పై ధర్మాసాగర్‌కు నుండి వస్తున్నారు. ఇస్మాల్‌ఖాన్‌పేటకు చెందిన దుర్గేష్ మోపెడ్‌పై భార్య కొడుకుతోపాటు మరోబాలుడు శరత్‌తో వెళుతున్నాడు. రెండు మోపెడ్‌లు ధర్మాసాగర్‌గేట్ సమీపంలోకి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో పాపయ్య, శరత్‌లకు గాయాలు అయ్యాయి. దీంతో పోలీసులు బాధితులను కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు గాయాలు కావడంతో ఇద్దరినీ మెదక్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన పాపయ్య